సాక్షి
మంచిర్యాల
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



ఫారెస్టులో ఫైర్‌లైన్స్

వేసవికాలంలో అడవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు నూతన విధానాన్ని అవలంబిస్తున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి మంటలు వ్యాపించకుండా చూస్తున్నారు. 8లో▸



సమ్మక్క జాతర

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సమ్మక్క–సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /20.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి.

మిల్లుల వద్దే పత్తి

- రోజుల తరబడి రైతుల పడిగాపులు
- తరచూ సీసీఐ కొనుగోలు కేంద్రాల మూత
- కొనుగోళ్లు చేపట్టాలని రైతుల ధర్నాలు, రాస్తారోకోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: దిగుబడి వచ్చిన పత్తిని విక్రయించాలంటే రైతులు రోజుల తరబడి జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్ముకోవాలని, మద్దతు ధర పొందాలని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని ప్రభుత్వం సూచిస్తోంది. కానీ కొనుగోలు కేంద్రాల్లో ఆచరణ సాధ్యం కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకొస్తున్న రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఎప్పుడు బంద్ ఉంటుందో.. ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. ఆన్‌లైన్ సర్వర్ పని చేయడం లేదని జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచే జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరి ఉన్నాయి. సోమవారం నుంచి తూకం వేయాల్సి ఉండగా ఆన్‌లైన్, సర్వర్ సమస్యలతో నిలిపివేశారు. ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక.. ఇంటికి తీసుకెళ్లలేక.. వాహన కిరాయితో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా మిల్లుల వద్దే పత్తి వాహనాలు ఉండడంతో వెయిటింగ్ చార్జీ కింద ఒక్కో వాహనానికి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిండి లేక రాత్రి, పగలు పత్తిని అమ్ముకునేందుకు మిల్లుల వద్ద గోస పడుతున్నామని వాపోతున్నారు. రోజుల తరబడి వాహనం లోడ్‌తో ఉంటే టైర్లు పాడవుతాయని, ఒక్కో టైరుకు రూ.10వేలు నష్టపోవాల్సి వస్తుందని వాహన యజమానులు చెబుతున్నారు.

దళారులకే మేలు..

రైతులు ఇబ్బంది పడకుండా చూడాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు, మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిన సీసీఐ పరోక్షంగా వ్యాపారులకు సహకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వారంలో రెండు మూడు రోజులు మాత్రమే కొనుగోలు కేంద్రం నడిపిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే చెన్నూర్ మార్కెట్ పరిధిలో నాలుగు సార్లు రైతుల ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు.



చెన్నూర్ రహదారిపై గత నాలుగు రోజులు నిలిచి ఉన్న పత్తి వాహనాలు



చెట్ల కింద సేదదీరుతున్న రైతులు

తప్పని పడిగాపులు..

జిల్లాలో సీసీఐ ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇప్పటివరకు సగం కూడా సేకరించ లేదు. బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని 2 జిన్నింగ్ మిల్లుల్లో, చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని 4, లక్సెట్టిపేటలోని జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత నవంబర్ నుంచి పత్తి కొనుగోలు ప్రారంభించారు. పత్తిలో 12శాతం లోబడి తేమ, తదితర నాణ్యత నిబంధనలతో కొనుగోలుకు తిరకాసు పెడుతున్నారు. ప్రభుత్వ సెలవులు శని, ఆదివారాలు, ఇతర పండుగ, అమావాస్య రోజు కొనుగోలు కేంద్రాలు మూసి ఉంటున్నాయి.

కొనుగోళ్లు నిలిపివేత

బెల్లంపల్లి: సాంకేతిక సమస్యలు, ఆధార్ సర్వర్ డౌన్ కావడంతో సీసీఐ పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపి వేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ.షాబొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10నుంచి ఆధార్ సర్వర్ పని చేయడం లేదని పేర్కొన్నారు. పత్తి కొనుగోళ్లకు పత్తి రైతుల ఆధార్ సమస్య ఎదురవుతోందని, ఈ కారణంగా జిల్లాలోని చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోళ్లను అనివార్యంగా నిలిపి వేశామని తెలిపారు. ఆధార్ సర్వర్ పునరుద్ధరణ తర్వాత కొనుగోళ్లు యధాతథంగా చేపడుతామని ప్రకటించారు. అప్పటి వరకు రైతులు ఎవరూ అమ్మకానికి పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని, మార్కెట్ కమిటీకి సహకారం అందించాలని కోరారు.

దీంతోపాటు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పెరిగిపోవడం, సాంకేతిక కారణాలు, వాతావరణ మార్పులు అంటూ కొనుగోలు కేంద్రాలు మూసివేస్తున్నారు. వారంలో రెండు మూడు రోజులు మాత్రమే కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. దీంతో రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడం, నిల్వలు పేరుకపోవడం వల్ల కొనుగోళ్లు నిలిచిపోయయాని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి షాబొద్దీన్ తెలిపారు.

నాలుగు రోజులైంది..



సోమవారం పత్తి తూ కం వేద్దామని ఆదివా రం సాయంత్రం చె న్నూర్ జిన్నింగ్ మిల్లుకు ట్రాక్టర్ పత్తి నింపుకొని వచ్చిన. ఆన్‌లైన్ పనిచేయడం లేదని బంద్ పెట్టింద్రు. నాలుగు రోజులు అవుతుంది. ట్రాక్టర్ కిరాయి రూ.3500, ఆగినందు కు రోజుకు రూ.1000 చొప్పున నాలుగు రోజులకు రూ.4 వేలు మొత్తం రూ.7500 కిరాయి అయింది. ఎప్పుడు ఆన్‌లైన్ పనిచేస్తుందో ఎప్పుడు కాంట పెడుతరో తెలుస్తలేదు. దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది.

– దుర్గం తిరుపతి, గ్రామం: నందులపల్లి, మం: నెన్నెల

అరిగోస పడుతున్నాం..



నాలుగు రోజులు చెన్నూర్ మిల్లు వద్ద అరి గోస పడుతున్నాం. రా త్రి, పగలు, తిండి తిప్పలు పడుతూ పత్తి లోడుతో ఉండాల్సి వస్తుంది. మమ్మల్ని పట్టించుకున్న నాథుడు లేడు. ఆన్‌లైన్ పనిచేయడం లేదని రోజుల కొద్దీ ఉంచుతున్నరు. అధికారులు, నాయకులు ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. – మామిడి రంజిత్, గ్రామం: కుందారం, మం: జైపూర్

దళారుల కోసమే..



నాలుగు రోజులుగా గోస పడుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రైవేటులో తక్కువ ధరకు రూ.6700 అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. గిన్ని రోజుల నుంచి పత్తిలోడుతో ఉంటున్న ఎవరూ పట్టించుకుంట లేరు. ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలి.

– అమీద్‌ఖాన్, చెన్నూర్

బండ్లు పాడైతున్నయి..



30 క్వింటాళ్ల లోడుతోనే నాలుగు రోజులుగా ఉంటే టైర్లు, బాడి మొత్తం పాడైతున్నయి. నాది ఓ టైర్ ఎయిర్ వచ్చి పాడైంది. టైర్‌కు రూ.9500 అవుతుంది. కిరాయి కోసం చూస్తే ఇంకా నష్టమే ఉంది. ఇటు రైతు బాధ చూస్తే వదిలి వెళ్లడం కష్టంగా ఉంది.

– డి.బాపు, గ్రామం: బురుగుపల్లి, మం: భీమారం, బొలొరా వాహనం యాజమాని

కొనుగోళ్లలో అక్రమాలు

- దళారులతో కుమ్మక్కై టీఆర్ పత్రాలు
- గత ఏడాది కంటే రెండింతల కొనుగోళ్లు
- కొనసాగుతున్న విచారణ



జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోళ్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో పత్తి సాగు విస్తీర్ణం ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయ అధికారులు జారీ చేయడంతోపాటు టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్) పత్రాల జారీ అధికారాన్ని మార్కెట్ కమిటీ అధికారులకు అప్పగించారు. దీంతో మార్కెట్ కమిటీ అధికారులు జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన దళారులతో కుమ్మక్కై పత్రాలు జారీ చేశారు. మార్కెట్ పరిధిలోని రైతుల వద్ద ఇప్పటికీ 40శాతం పత్తి ఉండగా.. గత ఏడాది 1.54లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేయగా.. ఈ ఏడాది 3.05లక్షల క్వింటాళ్ల పత్తి కొన్నారు. దీంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లపై విచారణ జరిపారు. వ్యవసాయ, మార్కెట్ కమిటీ అధికారులు జారీ చేసిన పత్రాల్లో భారీ తేడా రావడాన్ని గుర్తించారు. 1670 టీఆర్ పత్రాలు జారీ చేసినట్లు తెలిసింది. పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు గుర్తించి చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులను సస్పెండ్ చేశారు. జారీలో కార్యదర్శి, సిబ్బంది పాత్రపైనా ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

రైతుల ఇబ్బందులు

ధనార్జనే ధ్యేయంగా అధికారులు దళారులతో కుమ్మక్కై టీఆర్ పత్రాలు జారీ చేయడంతో చెన్నూర్ ప్రాంత రైతులు పత్తి విక్రయానికి ఇబ్బందులు పడుతున్నారు. పత్తి వాహనాలతో రోజుల తరబడి జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పత్తి దిగుబడి రెండు నెలలు ఆలస్యంగా రాగా.. రైతుల వద్ద నిల్వలు ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, విధుల నిర్వహణపై అధికారులు, సిబ్బంది శిక్షణ అంశాలను భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్‌లతో కలిసి స్టేజ్–1, 2 ఆర్వోలు ఎంపీడీవో, ఎంపీవోలకు స్థానిక సంస్థల ఎన్నికల ఎన్నికల ప్రవర్తనా నియమావళి, హ్యాండ్‌బుక్ నిర్వహణ, ఎన్నికల ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఫారాలు, కవర్లు, పోలింగ్ సామగ్రి సమకూర్చడంతోపాటు అదనంగా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికలో ప్రథమస్థానం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జన్నారం: జాతీయ ఉపకార వేతనాల(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికలో మండలంలోని కిష్టాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష 25మంది రాయగా.. 11మంది అర్హత సాధించి పాఠశాలను జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపారని ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏటా రూ.12వేలు ఉపకార వేతనం అందనుంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను డీఈవో యాదయ్య, ఎంఈవో విజయ్‌కుమార్ అభినందించారు.

మహిళలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న అదనపు డీసీపీ రాజు

మంచిర్యాలక్రైం: మహిళలు, విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసిన, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ రాజు హెచ్చరించారు. బుధవారం కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 29మంది ఈవ్‌టీజర్లకు 'ఉమెన్ సేఫ్టీ వింగ్' హైదరాబాద్‌కు చెందిన ప్రత్యేక నిపుణులతో ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో నాలుగు నెలలుగా షీ టీమ్ నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్ ద్వారా 29మంది ఈవ్‌టీజర్లను గుర్తించినట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేసినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా చట్టపరమైన చర్యలు ఎలా ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి షీ టీమ్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

గూడెంలో పౌర్ణమి జాతర



సామూహిక వ్రతాలు నోముతున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం మాఘపౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 242 మంది జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు రద్దీగా కనిపించాయి.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..

సత్యదేవుడి ఆలయంలో ఈ నెల 6నుంచి ప్రారంభమైన కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం పలు కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. సప్తాహ భజనలు కొనసాగాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, యాజ్ఞికులు అభిరామచార్యులు, నారాయణశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



శ్రీరాంపూర్: ఆర్కే న్యూటెక్ గనిలో పని స్థలాలను పరిశీలిస్తున్న సీఎండీ బలరాంనాయక్

- మహిళా ఉద్యోగులు అన్ని కేటగిరీల్లో పనిచేయాలి
- సింగరేణి సీఎండీ ఎన్.బలరాంనాయక్
- శ్రీరాంపూర్ ఏరియాలో ఆకస్మిక పర్యటన

శ్రీరాంపూర్: ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాంనాయక్ అన్నారు. బుధవారం ఆయన నూతన డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కే.వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)లతో కలిసి శ్రీరాంపూర్‌లో ఆకస్మికంగా పర్యటించారు. ఆర్కే 5, ఆర్కే 6, ఆర్కే 7, శ్రీరాంపూర్ ఓసీపీ, సీహెచ్‌పీలను సందర్శించి కార్మికులు, ఉద్యోగులతో మాట్లాడారు. ఆర్కే న్యూటెక్ గనిలో స్వయంగా దిగి పని స్థలాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక నుంచి మహిళా ఉద్యోగులు అన్ని కేటగిరీల్లో పని చేయడానికి సిద్ధంగా ఉండాలని, భూగర్భంలో కూడా దిగి పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇక నుంచి ఈపీ ఆపరేటర్లుగా కూడా వెళ్లడానికి అవకాశం ఉందన్నారు. సంస్థ కల్పిస్తున్న అవకాశాలను మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సంస్థ ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి దిశగా ముందుకెళ్తోందని తెలిపారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు.



కార్మికులు, ఉద్యోగులతో ఫొటో దిగుతున్న సీఎండీ

అధికారుల సంఘం వినతి..

సమస్యలు పరిష్కరించాలని సింగరేణి సీఎండీని అధికారుల సంఘం నాయకులు కోరారు. సీసీసీ గెస్టు హౌజ్‌లో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. నూతన డైరెక్టర్లను సన్మానించారు. ఆయా కార్మిక సంఘాల నేతలు సీఎండీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ.శ్రీనివాస్, ఏరియా ఎస్ ఓ టు జీఎం యన్.సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రూప్ ఏజెంట్లు కే.రాజేందర్, శ్రీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, గనుల మేనేజర్లు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

కాసిపేట: కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ కృషి చేస్తుందని సీఎండీ బలరాం నాయక్ తెలిపారు. బుధవారం సాయంత్రం మందమర్రి ఏరియా కాసిపేట1, 2ఇంక్‌లైన్ గనులను డైరెక్టర్లతో కలిసి సందర్శించారు. గని మేనేజర్ మొదలు కార్మికుల వరకు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికులతో సెల్ఫీలు, ఫొటోలు దిగి సమస్యలు తెలుసుకున్నారు. కాసిపేట 1గని క్లర్క్ బన్న లక్ష్మణ్‌దాస్ సీఎండీతోపాటు డైరెక్టర్లకు పుస్తకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఏజెంటు రాందాస్, గనుల మేనేజర్లు భూశంకరయ్య, లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి

మందమర్రిరూరల్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా 45 రోజులు మిగిలి ఉందని, బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని సీఎండీ ఎన్.బలరాంనాయక్ అన్నారు. బుధవారం ఆయన ఏరియాలోని కేకే–5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్ వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో బొగ్గు వినియోగం ఎక్కువగా ఉందని, డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. యూనియన్ నాయకులు ఉచిత మస్టర్లు పడిపోతే సహించేది లేదని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి కోసం వినియోగించే బిట్లు, డ్రిల్ రాడ్స్ నాణ్యమైనవి సరఫరా చేయడం లేదని, గనుల్లో కొత్త ఎస్డీఎల్ యంత్రాలు అవసరమని ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఏరియా జీఎం దేవేందర్, గని మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ నాయకులు ఉన్నారు.

నిలువ నీడ కోల్పోయిన దివ్యాంగ దంపతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇరువర్గాల గొడవ ఓ దివ్యాంగుడి కుటుంబానికి నిలువ నీడ లేకుండా చేసింది. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని తిలక్‌నగర్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 101మంది దివ్యాంగులకు 75గజాల చొప్పున ఇళ్లు మంజూరు చేసింది. ఆ సమయంలో కొందరు ఆ ఇళ్లలో ఉండేందుకు ముందుకు రాలేదు. దీంతో ఖాళీగా ఇళ్లను అప్పటి అధికారులు మరోసారి అర్హులైన దివ్యాంగులకు అప్పగించగా, అక్కడే నివాసం ఉంటున్నారు. గతంలో కేటాయించిన ఇంటి పట్టాను చూపిస్తూ.. ప్రస్తుతమున్న వారిని అక్కడ ఉండొద్దంటూ దౌర్జన్యం చేయడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే తీరుగా దివ్యాంగుడైన గోదారి మల్లేశ్ ఖాళీగా ఉన్న ఇంటి పక్కన రేకుల షెడ్డు వేసుకుని తొమ్మిదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. 2016లో రెవెన్యూ శాఖ నుంచి ఆక్యుపై సర్టిఫికేట్, మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబరు, నల్లా, విద్యుత్ కనెక్షన్ పొందాడు. గతంలో పట్టాపొందిన వారు ఇదే జాగాను వేరే వ్యక్తులకు రూ.3లక్షలకు విక్రయించారు. తాజాగా ఆ జాగా స్వాధీనానికి మల్లేశ్ రేకులషెడ్డును కూల్చివేయడంతో నిలువ నీడ లేకుండా పోయింది. దంపతులు ఇద్దరు పుట్టకతోనే దివ్యాంగులు. ఏడాదిన్నర బాబుతో ఎండలోనే గత మూడు రోజులుగా గడుపుతున్నారు. పింఛన్ ఆధారంగా బతికే తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నాడు. ఇప్పటికే ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. దీనిపై మంచిర్యాల తహసీల్దార్ రఫతుల్లా, సీఐ ప్రమోద్‌రావు దృష్టికి వెళ్లగా.. విచారణ చేస్తామని తెలిపారు.



భార్య, కొడుకుతో దివ్యాంగుడు మల్లేశ్

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

శ్రీరాంపూర్: నస్పూర్ పట్టణంలోని నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో అండర్–16 బాలబాలికల జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. రెండు రోజులుగా కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బుధవారం జట్లను ప్రకటించారు. ఈ జట్లు ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ పట్టణంలోని షేక్‌నగర్ మైదానంలో జరిగే 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బాలుర జట్టులో పీ.సందీప్, పీ.ఆదిత్య, టీ.రఘువర్ధన్, జీ.మనోజ్, ఎం.ప్రసాద్, కే.విక్రిత్, ఏ.సాయిరిషిత్, ఆర్.జస్వంత్, సీహెచ్.హర్షిత్, ఎం.చరణ్‌చంద్ర, బీ.రంజిత్, యూ.చరణ్ ఉన్నారు.



ఎంపికైన బాలికల జట్టు

బాలికల జట్టులో..

ఏ.ఉషారాణి, కే.నిరీక్షణ, కే.శాశ్వత, ఎం.కృష్ణకుమారి, ఎం.అక్షయ, ఆర్.మనోజ్ఞ, ఎం.అనన్య, ఎం.సంగీతరాణి, ఎస్.క్రాంతికేయ, ఏ.చంద్రస్మిత, ఎస్.సమన్వి, ఎం.వేదనసాయి, టీ.హారిక, సహ స్ర, బీ.అక్షర ఉన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నియామకాలపై లెక్కేది?

- 'నస్పూర్' పరిధిలో నిబంధనలకు నీళ్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మున్సిపల్ సిబ్బంది నియామకాల్లో ఉల్లంఘనలు జరుగుతున్నాయి. పాలకవర్గాలు అవసరాల పేరిట ఇష్టారీతిన తాత్కాలిక, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను విధుల్లోకి తీసుకున్నారు. వారికి ఇప్పటికీ సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా మంచిర్యాల కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో నస్పూర్ మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల సిబ్బంది వివరాలు అందించారు. నస్పూర్ మున్సిపాలిటీలో ఎలాంటి అధికారిక అనుమతి లేకుండానే పని చేస్తున్న తాత్కాలిక సిబ్బందిని కార్పొరేషన్‌కు అప్పగిస్తూ అక్కడి అధికారులు వివరాలు అందజేయడంపై ఆరోపణలు వస్తున్నాయి. నస్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మొదట 121మంది సిబ్బంది పని చేసేవారు. మున్సిపాలిటీ అయిన తర్వాత మరో 9మంది, ఆ తర్వాత మరో ఇద్దరిని సీడీఎంఏ అనుమతితో ఏడాది కాలానికి పనిలోకి తీసుకున్నారు. దీంతో ఆ సంఖ్య 132మందికి పెరిగింది. ఆ తర్వాత అవసరాల కోసం మళ్లీ 2021లో కరోనా సమయంలో మొదట 56మంది, తర్వాత 30మంది, 2024లో 35మంది చొప్పున తాత్కాలికంగా మొత్తంగా 121మందిని తీసుకున్నారు. వీరిని సైతం ఒకేసారి కాకుండా పలు దఫాలుగా పాలకవర్గం తీర్మానాలు చేస్తూ పనిలోకి తీసుకున్నారు. మొత్తం 132మంది అవుట్‌సోర్సింగ్, మరో 121మంది తాత్కాలిక సిబ్బందిని కలిపి 253మంది పని చేస్తున్నట్లు కార్పొరేషన్‌కు వివరాలు అందించారు. 2021లో మూడు నెలల కోసమే తీసుకోగా, వారిని ఇంకా కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ ఆ సిబ్బంది నియామకంపై ఉన్నతాధికారుల అనుమతి పొందలేదు. మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేదు. పలుమార్లు తీర్మాన కాపీల్లో చేర్చుతూ జీతాలు చెల్లిస్తున్నారు. ఈ సిబ్బందిని మున్సిపాలిటీలో నియమించుకునేందుకు అప్పటి పాలకవర్గంలో కొందరు ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో నస్పూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు లేక నెలల తరబడి ఇబ్బందులు పడ్డారు. తాజాగా కార్పొరేషన్‌కు సైతం కొత్తగా చేరుతున్న సిబ్బందికి మళ్లీ వేతనాలకు సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చెన్నూర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే పరిష్కార వేదిక లక్ష్యమని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకుల నారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నిజామాబాద్ సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల నుంచి ఆరుగురు విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఐదింటిని పరిష్కరించామని అన్నారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ టెక్నికల్ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, మత్రిపల్లి రాజాగౌడ్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రసాద్ పథకంలో చేర్చాలి



కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యే

బెజ్జూర్: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యే బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు తదితరులున్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డ ఇద్దరి అరెస్ట్



నిందితులతో ఎస్సై, పోలీసులు

జైపూర్: ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడ్డ నిందితులను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండలంలోని పెగడపల్లి రాజరాజేశ్వరస్వామి (శివాలయం)లో ఈ నెల 1న రాత్రి తాళం పగులగొట్టి వెండి, బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. 7వ తేదీన మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలోగల రసూల్‌పల్లి వద్ద గల హనుమాన్ ఆలయంలో రాత్రి వేళ చోరీకి పాల్పడి విలువైన వస్తువులు దోచుకుపోయారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీధర్, నాగరాజు రెండు బృందాలుగా తనిఖీ చేపట్టారు. బుధవారం ఇందారం క్రాస్ రోడ్డు వద్ద లక్ష్మీపురం గేట్ ఎన్టీపీసీకి చెందిన తాటికొండ అనిల్, గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన బెజ్జాల విష్ణును పట్టుకుని వారి నుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు.

గుర్తు తెలియని రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల శివారులోని గోదావరి సమీపంలో రైలు కింద పడి ఒకరు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన అటకపురం రాజలింగు (48) కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజలింగుకు భార్య మహేశ్వరి, ఇద్దరు కూతుళ్లున్నారు. మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

రీచార్జ్ సెంటర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌కు చెందిన విజయ్‌సింగ్ పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో పాన్ షాప్‌తో పాటు రీచార్జ్ సెంటర్ కొనసాగిస్తున్నాడు. రోజులాగే మంగళవారం రాత్రి 10 గంటలకు షాపు మూసివేసి ఇంటికెళ్లాడు. బుధవారం ఉదయం 6గంటల ప్రాంతంలో వెళ్లి చూసే సరికి షాపులో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని రూ.23వేల నగదు, సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ వివరించారు.

ఫారెస్ట్‌లో ఫైర్‌లైన్స్

- ఫలిస్తున్న నూతన విధానం
- శాటిలైట్ సేవలూ వినియోగం
- తగ్గుతున్న అగ్ని ప్రమాదాలు



ఎయిర్‌బ్లోయర్‌తో ఆకులను దూరం చేస్తున్న సిబ్బంది



జన్నారం డివిజన్‌లో అగ్గి వరుసలు

జన్నారం: వేసవిలో అడవులకు అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ కారణంగా వన్యప్రాణులు, పక్షులకు ప్రాణహాని కలగనుంది. ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో అటవీశాఖ నూతన విధానాన్ని రూపొందించింది. వేసవిలో ప్రమాదాలు నివారించేందుకు అటవీ అధికారులు మూడేళ్లుగా కొత్త పద్ధతి పాటిస్తున్నారు. కూలీల ద్వారా ఫైర్‌లైన్స్ (అగ్గి వరుసలు) ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానం వేసవిలో అడవికి నిప్పు అంటుకోకుండా మంచి ఫలితాలనిస్తోంది. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో మూడు అటవీ రేంజ్‌లలోని 40 అటవీ బీట్‌లలో ఫైర్‌లైన్ పనులు చేపట్టారు. గతేడాది 60 కిలో మీటర్ల దూరంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం 150 కిలో మీటర్ల దూరం ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో ఫైర్‌లైన్స్ కోసం కాంపా పథకం కింద నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నారు. సిబ్బంది పని తీరుపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అగ్గి పడిందని సమాచారం అందగానే సంబంధిత అధికారులు ఆ స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేయాల్సి ఉంటుంది.

ఫైర్‌లైన్స్ అంటే..

అడవిలో ప్రస్తుతం ఆకులు రాలిపోతాయి. దీంతో పశువుల కాపరులు గాని, అడవికి వెళ్లిన వారు గాని బీడీ, చుట్ట తాగి అలాగే పడేస్తే ఎండిన ఆకులకు అంటుకుని అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. దీని ద్వారా మంటలు అడవంతా వ్యాపించి పక్షులు, చెట్లు, వన్యప్రాణులకు ప్రాణహాని కలిగే అవకాశముంది. అగ్గి అడవంతా వ్యాపించకుండా అటవీశాఖ అధికారులు మూడేళ్లుగా ఫైర్‌లైన్స్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రతీ బీట్‌లోని అటవీ ప్రాంతాల్లో ఎడ్లబండ్ల తొవ్వలు, కాలి బాటలకు ఇరువైపులా గల ఎండిన ఆకులను ఎయిర్ బ్లోయర్ల సాయంతో ఐదు మీటర్ల వెడల్పులో పోగు చేస్తారు. ఆకులను తొవ్వలపై వేసి అడవికి అంటకుండా నిప్పు పెట్టి కాలుస్తారు. అనుకోకుండా అగ్ని ప్రమాదం జరిగినా ఫైర్‌లైన్ వరకే కాలి ఆగిపోతుంది. అడవంతా వ్యాపించే అవకాశం ఉండదు. అందుకే ఎప్పటికప్పుడు దారులపై ఎండిన ఆకులను ఉండకుండా చూస్తారు. దీంతో అడవుల్లో అగ్ని ప్రమాదాలతో ఎక్కువ నష్టం జరగకుండా ఉంటుంది. అన్ని డివిజన్లలోని కంపార్ట్‌మెంట్, బీట్, డివిజన్, బౌండరీల్లో ఈ అగ్గి వరుసలు ఏర్పాటు చేస్తారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు

అటవీ సమీప గ్రామాల్లో శాటిలైట్ ద్వారా ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు అగ్ని ప్రమాదాలు సంభవించే అటవీ సమీప గ్రామాల ప్రజలకు అగ్ని ప్రమాదాలు, నష్టం తదితర విషయాలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పశువుల కాపరులు అగ్గి పెట్టెలు, సిగరెట్లు, బీడీలు అడవులకు పట్టుకెళ్లకుండా చూస్తున్నారు. కొందరు బీడీ ఆకుల కోసం, ఇప్పపువ్వు కోసం చెట్లకు నిప్పు పెట్టే అవకాశం ఉన్నందున వాటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

శాటిలైట్ ద్వారా ఫైర్ అలర్ట్

అటవీశాఖ ఉన్నతాధికారులు అగ్ని ప్రమాదాలను నివారించేందుకు టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఎస్ఎన్‌పీపీ అనే శాటిలైట్ ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ అధ్వర్యంలో శాటిలైట్ ద్వారా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా వెంటనే సమాచారం చేరవేస్తారు. ప్రతీరోజు 24 గంటలు ఏ చోట అగ్ని ప్రమాదం జరిగినా, ప్రమాదం జరుగుతున్న ప్రదేశం గురించి సంబంధిత అధికారుల మొబైల్ ఫోన్‌కు మేసేజ్ వస్తుంది. రోజుకు రెండుసార్లు సమాచారం చేరవేస్తుంది. కంపార్ట్‌మెంట్ నంబర్‌తో ఏరియాతో సహా తెలియపరుస్తారు. దీంతో సంబంధిత అధికారులు జీపీఎస్ ద్వారా ఆ ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పివేస్తారు. అంతే కాకుండా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఏ ప్రాంతాల్లో ఉన్నాయో కూడా శాటిలైట్ ద్వారా ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తారు. దీంతో అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో తగు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ సంవత్సరం శాటిలైట్ ద్వారా మరికొంత మేలు జరిగేలా అధికారులు చూస్తున్నారు. గతంలో అగ్ని ప్రమాదం జరిగిన రెండు గంటలకు సమాచారం వచ్చేది. ప్రస్తుత శాటిలైట్ ద్వారా వెంటనే గుర్తించవచ్చని, తద్వారా త్వరగా ఆ ప్రాంతానికి చేరుకుంటే మంటలు ఆర్పి ప్రమాదాన్ని నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. శాటిలైట్ సాయంతో అగ్ని ప్రమాదాలు 80 శాతం వరకు నివారించగలిగామని అధికారులు పేర్కొంటున్నారు. 2020–23 సంవత్సరంలో ఇందన్‌పల్లి రేంజ్‌లో సుమారు 220 అగ్ని ప్రమాదాలు జరిగాయి. 2023–24 సంవత్సరంలో ప్రమాదాల సంఖ్య 90కి తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం మరింత తగ్గే అవకాశముందని పేర్కొంటున్నారు.

అందుబాటులో ఎయిర్ బ్లోయర్లు

జన్నారం అటవీ డివిజన్‌లోని మూడు రేంజ్‌లు, 40 అటవీ బీట్‌లలో గతంలో ఆరు బ్లోయర్లు ఉండగా ప్రస్తుతం మరో తొమ్మిది కొత్తవి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో మంటలు ఆర్పివేయడం సులువుగా ఉంటుంది. మంటలు వ్యాపించకుండా, బ్లోయర్ల సాయంతో ఎండిన ఆకులను దూరం చేస్తారు. దీంతో మంటలు అక్కడి వరకే వ్యాపించి ఆగిపోతాయి. శాటిలైట్ అలర్ట్ మెసేజ్ ఎప్పుడు వచ్చినా సిబ్బంది సంబంధిత ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎక్కువ మంటలు వ్యాపిస్తే టెంపరేచర్ పెరిగి ఒక్కోసారి అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉన్నందున వేరే సిబ్బంది సహాయం కూడా తీసుకోనున్నట్లు పేర్కొంటున్నారు.

సిబ్బందిని అలర్ట్ చేశాం



వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అడవికి వెళ్లేవారు అగ్గిపెట్టెలు, సిగరెట్లు, బీడీలు పట్టుకుపోకుండా సహకరించాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి వెళ్లి మంటలు ఆర్పివేయాలని సిబ్బందిని ఆదేశించాం. బ్లోయర్ల సంఖ్య పెంచి వారిని అలర్ట్‌గా ఉంచుతున్నాం. శాటిలైట్ సాయంతో గతంలో కన్నా ప్రమాదాలు తగ్గాయి. ఇంకా తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. – శివ్ ఆశిష్‌సింగ్, డీఎఫ్‌వో

భూఆక్రమణకు యత్నించిన ఇద్దరిపై కేసు

వేమనపల్లి: మండలంలోని కాటేపల్లి అటవీ ప్రాంతంలో చెట్లు నరికి అటవీ భూమిని ఆక్రమించేందుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎఫ్ఆర్వో అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాటేపల్లి గ్రామానికి చెందిన మానేపల్లి రాజన్న, మానేపల్లి నరేశ్ నీల్వాయి ప్రాజెక్టు శిఖాన్ని ఆనుకుని ఉన్న అటవీ భూమిలో ఏడాదిగా సాగుకు యత్నిస్తున్నారు. ఇటీవల ఆ భూమిలోకి వెళ్లి పలు చెట్లను నరికి పోడు సాగుకు యత్నించారు. స్థానిక బీట్ అధికారి స్వామి, చామనపల్లి ఎఫ్ఎస్వో స్వరూప ఘటనా స్థలానికి వెళ్లి వీరిని అదుపులోకి తీసుకున్నారు. 1967 అటవీ భూ సంరక్షణ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు రేంజర్ తెలిపారు. కొత్తగా అటవీ భూమి ఆక్రమణకు పాల్పడినా, చెట్లను నరికినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం



సునీతకు శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

భీమారం: నెన్నెల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కొర్తె సునీత నిండు గర్భిణి. మంగళవారం రాత్రి ఆమెకు పురుటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది ఆమెను మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈక్రమంలో భీమారం–జైపూర్ మధ్య అటవీప్రాంతంలో ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 ఈఎంటీ జెల్ల మల్లేశ్, పైలెట్ పవన్ అంబులెన్స్‌ను నిలిపి ఆమెకు పురుడు పోయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. సునీత కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుకే ఫోన్‌కాల్ చేసిన సైబర్ కేటుగాడు

- చాకచక్యంగా తప్పించుకున్న వైనం



పోలీసుకు వచ్చిన వాట్సాప్ కాల్ స్క్రీన్‌షాట్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ పేరిట ఓ కేటుగాడు పోలీసుకే వాట్సాప్ కాల్ చేసి ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించి రూ.6వేలు చెల్లిస్తే పాత బకాయి మొత్తం క్లియర్ అవుతుందని చెప్పాడు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆ డబ్బులు చెల్లిస్తే పని అవుతుందని సూచించాడు. వాట్సాప్ కాల్ చేసిన సమయంలో మున్సిపల్ కమిషనర్ ఫొటో డీపీగా రావడంతో సదరు పోలీసు ఉద్యోగి నిజమేనని నమ్మాడు. హడావుడిగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాడు. కమిషనర్ లేకపోవడంతో సిబ్బందికి విషయం తెలిపాడు. ఆ నంబర్ మున్సిపల్ కమిషనర్‌ది కాదని సిబ్బంది తెలుపగా అసలు విషయం గ్రహించాడు. పోలీస్ ఉద్యోగి తిరిగి అదే నంబర్‌కు వాట్సాప్ కాల్ చేయగా 'మీరు అక్కడే ఉండండి.. ఓ వ్యక్తి వస్తాడు, అతనికి డబ్బులు ఇవ్వాలి' అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఇది మోసగాళ్ల పన్నాగమని గ్రహించిన సదరు ఉద్యోగి ఫోన్ చేసింది మున్సిపల్ కమిషనర్ కాదని గుర్తించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎవరికైనా ఫేక్ నంబర్లు, వీఐపీల డీపీలతో వాట్సాప్ కాల్స్ వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలని సైబర్ క్రైం డీఎస్పీ హసీబుల్లా తెలిపారు. ఫోన్‌కు వచ్చే లింకులు, మెస్సేజ్‌లకు స్పందించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్ వచ్చినా, డబ్బులు కోల్పోయినా www. cybercrime. com లో ఫిర్యాదు చేయాలని, ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను అపరిచిత వ్యక్తులకు తెలుపవద్దని సూచించారు.

విలేకరుల పేరిట వసూళ్లు

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- కారు, రూ.90 వేల నగదు, ఐడీ కార్డుల స్వాధీనం



కారు, నిందితులతో ఏసీపీ, పోలీసులు

వేమనపల్లి: అక్రమార్జన కోసం విలేకరి ముసుగు తొడిగి వసూళ్లకు పాల్పడుతున్న ఏడుగురిని నీల్వాయి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమార్జనే ధ్యేయంగా చొప్పదండి జనార్దన్, తుంగ రమేశ్, మాసాని రమేశ్, తోడేటి సంతోష్, జిల్లపల్లి పోశం, తగడం వెంకటేశ్, డొబ్బల విష్ణు విలేకరుల పేరిట ముఠాగా ఏర్పడ్డారు. ఏడాదిగా పశువుల వ్యాపారులు, కలప తరలించే వారు, రేషన్ బియ్యం, ఇసుకను అక్రమంగా తరలించే వారిని బెదిరిస్తూ భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. గోదావరిఖనికి చెందిన జక్కుల శ్రీధర్, మొగిలి అనిల్, పక్కనే ఉన్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల నుంచి ఎద్దులు కొనుగోలు చేసి తీసుకువస్తుండగా తెల్లవారుజామున కళ్లెంపల్లి వద్ద అటకాయించారు. అనుమతులు లేకుండా పరిమితికి మించి పశువులను తీసుకెళ్తున్నందుకు వ్యాన్ సీజ్ చేయిస్తామని, వ్యాపారం చేయకుండా చేస్తామని బెదిరించారు. దీంతో భయపడిన వ్యాపారులు రూ.50 వేలు ఫోన్‌పే ద్వారా, రూ.30 వేల నగదు చెల్లించారు. ఆ తర్వాత వారు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. అలాగే గాదె మహేశ్‌ను బెదిరించి రూ.3లక్షలు డిమాండ్ చేయగా రూ.75 వేలు చెల్లించినట్లు, అజీజ్ నుంచి రూ.5వేలు, చల్ల కుమార్ నుంచి రూ.15 వేలు, ఆలుగామకు చెందిన రైతు వద్ద అక్రమ కలప ఉందని బెదిరించి రూ.9వేలు వసూళ్లకు పాల్పడ్డారు. పోలీసులు వీరిని అరెస్ట్ చేసి ఫోర్డ్ కారు, ఐడీ కార్డులు, రూ.90 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అందరూ నేరచరితులే..

ముఠాగా ఏర్పడిన ఈ నకిలీ విలేకరులు నేరచరిత్ర కలిగిన వారే. చెన్నూర్, రామకృష్ణాపూర్, నీల్వాయి పోలీస్‌స్టేషన్లలో వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదైనట్లు ఏసీపీ వెల్లడించారు. చొప్పదండి జనార్దన్ (రామకృష్ణాపూర్) చైన్‌స్నాచింగ్ కేసు, మాసాని రమేశ్‌పై చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు, తగరం వెంకటేశ్‌పై చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏడు కేసులు, తోడేటి సంతోష్‌పై చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు, తుంగ రమేశ్‌పై కోటపల్లి, చెన్నూర్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు, జిల్లపల్లి పోశంపై బైండోవర్ కేసులున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ ముఠా ఎవరినైనా బెదిరించినట్లు ఫిర్యాదు చేస్తే వారికి న్యాయం చేస్తామని ఏసీపీ పేర్కొన్నారు. అక్రమంగా, అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్న వ్యాపారులపై కూడా ఎనిమల్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఉన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

నిర్మల్‌టౌన్: యువతిని వేధించి హత్య చేసిన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జీవితకాల కఠిన కారాగార జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి డల్లుసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన జూకింది శ్రీకాంత్ అదే కాలనీకి చెందిన చెటపల్లి అలేఖ్యను ఐదేళ్లుగా పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపుతానని వేధించేవాడు. అలేఖ్య విషయం కుటుంబ సభ్యులకు తెలుపగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినా శ్రీకాంత్ అలేఖ్యను వేధిస్తూనే ఉన్నాడు. ఈక్రమంలో అలేఖ్యకు కుటుంబ సభ్యులు పెండ్లి సంబంధం చూడగా, శ్రీకాంత్ చెడగొట్టాడు. పెద్దల సమక్షంలో మళ్లీ పంచాయితీ నిర్వహించి అలేఖ్య జోలికి రావద్దని శ్రీకాంత్‌తో పత్రం రాయించుకున్నారు. అయినా శ్రీకాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోగా తనకు దక్కని అలేఖ్య ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు అతడి తల్లి సత్తవ్వ, తమ్ముడు శివకృష్ణ ప్రోత్సహించారు. దీంతో శ్రీకాంత్ పవర్ అర్జున్‌కు రూ.800 ఇచ్చి కొబ్బరి బోండాలు నరికే కత్తిని తయారు చేయించుకున్నాడు. 8 ఫిబ్రవరి 2024న ఉదయం అలేఖ్య తన వదిన జయశీల, ఆమె రెండేళ్ల కొడుకుతో కలిసి టైలరింగ్ శిక్షణకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తోంది. గమనించిన శ్రీకాంత్ తన బైక్‌పై వెళ్లి కత్తితో వెనుక నుంచి అలేఖ్యను మెడ, తల, ఇతర భాగాల్లో నరికాడు. జయశీల అడ్డు రాగా ఆమె చేతులపై నరికి, ఆమె రెండేళ్ల కొడుకు తలపై కొట్టాడు. గమనించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడికి చేరుకుని చికిత్స కోసం వారిని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అలేఖ్య మృతి చెందినట్లు తెలిపారు. అలేఖ్య అన్న గణేశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై లింబాద్రి కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ మోహన్ శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారు. ప్రస్తుత సీఐ సైదారావు కేసును పరిశోధన చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 27 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో శ్రీకాంత్‌కు జీవితకాలం కఠిన కారాగార జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు.

సోనాలలో ఓ ఇంట్లో భారీ చోరీ

- నగదు, బంగారం, వెండి ఆభరణాల అపహరణ



తెరిచి ఉన్న బీరువా

బోథ్: సోనాల మండల కేంద్రంలో వ్యాపారి ఎస్కే ఉస్మాన్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దాటాక చోరీ జరిగింది. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం ఉస్మాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రకు పెళ్లికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి రూ.4 లక్షల నగదు, 6 తులాల బంగారు, 18 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. మంగళవారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ఉస్మాన్ కుటుంబీకులు ఇంటికి రాగా తలుపు తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు నేలపై పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి ఉస్మాన్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కాగా, సీఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఫింగర్ ప్రింట్లు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపరిచితులు కనిపిస్తే 'డయల్ 100'కు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

కరీంనగర్ జిల్లాలో ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సేవలు

- నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రముఖ గాయని మధుప్రియ



ట్రావెల్స్‌ను ప్రారంభిస్తున్న మధుప్రియ, రమణ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సింగర్ మధుప్రియ

కరీంనగర్: టూర్స్ అండ్ ట్రావెల్స్ రంగంలో 25ఏళ్ల అనుభవమున్న ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ కరీంనగర్ జిల్లాలో తమ సేవలు అందించనుంది. ఈ సందర్భంగా నూతన కార్యాలయాన్ని జిల్లాలో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గాయని మధుప్రియ హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో సేవలందిస్తున్న ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఇప్పుడు ఉత్తర తెలంగాణ ప్రజలకు మరింత అందుబాటులోకి రావడం చాలా సంతోషకరమని తెలిపారు. అతి తక్కువ ధరల్లో చక్కటి సౌకర్యాలతో యాత్రలు చేసేలా దాదాపు వందకు పైగా దేశ, విదేశీ యాత్రలకు సంబంధించి టూర్ ప్యాకేజీలను అందించడం శుభపరిణామమన్నారు. సంస్థ చైర్మన్ ఆర్‌వీ రమణ మాట్లాడుతూ కాశీ–అయోధ్య రూ.21,999, బ్యాంకాక్ రూ.33,999, మలేషియా రూ.49, 999, యూరప్ ట్రిప్ రూ.3,25,000 అందిస్తున్నామని పేర్కొన్నారు. చార్ధామ్, అమర్నాథ్ ముక్తినాథ్, కర్ణాటక, కశ్మీర్, కేరళ, తమిళనాడు వంటి అనేక దేశీయ యాత్రలతో పాటు దుబాయ్, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ వంటి అనేక విదేశీ యాత్రలపై కూడా భారీ డిస్కౌంట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం ఫిబ్రవరి 15వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని వివరించారు.

బైంసాలో ఇసుక డంపుల సీజ్

బైంసాటౌన్: పట్టణంలోని పలుచోట్ల అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆర్ఐ జయరావు నేతృత్వంలో పట్టణంలోని ఆటోనగర్, మైనారిటీ గురుకుల పాఠశాల వెనుక, ఇతర ప్రాంతాల్లో బుధవారం తనిఖీ చేశారు. 100 ట్రాక్టర్ల ఇసుక డంపులు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యలకు మైనింగ్ శాఖ అధికారులకు నివేదించనున్నట్లు వెల్లడించారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన ఓ మహిళను అదే కాలనీకి చెందిన వ్యక్తి శారీరకంగా లోబరుచుకుని అపహరించిన కేసులో నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్ అదే కాలనీకి చెందిన ఓ వివాహితను ప్రేమ పేరిట వేధించాడు. తనకు కుమారుడున్నాడని చెప్పినా వినకుండా తరచూ ఆమె ఇంటికి వెళ్లి పలుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవాలని, లేకుంటే తనతో ఉన్న వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఆటోలో తీసుకువచ్చి ఆమెను పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఎనిమిది నెలల పాటు నిర్బంధించాడు. ఆయన నుంచి తప్పించుకున్న మహిళ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అట్రాసిటీతో పాటు పలు కేసులు నమోదు చేసినట్లు వారు వివరించారు.

కొత్తరహపల్లిలో మూడిళ్లు దగ్ధం



కొత్తరహపల్లిలో ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

ఆసిఫాబాద్‌రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో మూడిళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని కొత్తరహపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షెండే బాపు, షెండే అన్నారావు, అనంతరావుతోపాటు వినాయకరావుకు చెందిన ఇళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఓ ఇంట్లోని రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో నిత్యావసర సరుకులు, పత్తి అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా కాగజ్‌నగర్ నుంచి మూడు ఫైరింజన్లు వచ్చి మంటలు ఆర్పివేశాయి. తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే పంచనామా నిర్వహించి షెండే ఆనంద్‌రావు రూ.5లక్షలు, బాపు రూ.6లక్షలు, అన్నారావు రూ.7లక్షల వరకు ఆస్తి నష్టపోయినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, నాయకుడు రవీందర్ పరామర్శించారు. తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదు అందజేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.